


సిద్ధమైన క్యూలైన్లు



విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయం



జయహో దుర్గాభవానీ

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు

- ఇంద్రకీలాద్రిపై అన్ని ఏర్పాట్లు పూర్తి
- గిరిప్రదక్షిణకు సర్వంసిద్ధం చేసిన అధికారులు
- అగ్నిప్రతిష్ఠాపనతో ఐదు రోజుల ఉత్సవాలకు శ్రీకారం

వన్‌టౌన్, జనవరి 2 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ మహోత్సవాలకు సర్వంసిద్ధమైంది. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు బుధవారం ఉదయం 6.30 గంటలకు హోమగుండాల్లో అగ్ని ప్రతిష్ఠాపన చేస్తారు. అనంతరం శతచండీయాగం జరుగుతుంది. తొలుత భక్తులు కృష్ణా స్నానఘాట్లలో స్నానమాచరించి, గిరిప్రదక్షిణ చేస్తారు. సుమారు ఏడు కిలోమీటర్ల నిడివిలో ఉండే గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 20 పాయింట్లలో మంచినీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. గిరిప్రదక్షిణ అనంతరం భక్తులు కొండకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం ఇరుముడులు సమర్పించి అక్కడున్న గురుస్వాముల వద్ద మాల విరమణ చేస్తారు. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి తిరిగి స్నానఘాట్లలో స్నానాలు ఆచరించి, ప్రసాదాలు కొనుగోలు చేసుకుని, దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాదాన్ని స్వీకరించి తిరుగు పయనమవుతారు.

ప్రత్యేక ఏర్పాట్లు

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలిరానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీస్, రెవెన్యూ, దేవదాయ శాఖ, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో దీక్షల విరమణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలు ప్రారంభమవుతాయి. ఇరుముడులు సమర్పించేందుకు నాలుగు హోమగుండాలను సిద్ధం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న కారణంగా పటిష్ఠ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఘాట్ల వద్ద, కేశఖండన శాల వద్ద జల్లుస్నానాలు సిద్ధం చేశారు. కొరత లేకుండా లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సబ్‌కలెక్టర్ అదితిసింగ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, ఆలయ ఈవో కేఎస్ రామరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా, డీఐజీ విశాల్‌గున్నీ ఎప్పటికప్పుడు పరిశీలించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు.

బెజవాడలో ట్రాఫిక్ మళ్లింపు

- భవానీ దీక్షల విరమణ నేపథ్యంలోనే..
- ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు

- 6లో..



పుస్తకాల పండుగ

34వ విజయవాడ పుస్తక మహోత్సవానికి సందర్శకుల తాకిడి పెరుగుతోంది. మంగళవారం కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు బుక్ ఫెస్టివల్‌ను తిలకించారు.






మల్లాది అవుట్!

ఫట్టా

వైసీపీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం ప్రకటిం చారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు హ్యాండివ్వగా, పశ్చిమలో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న వెలంపల్లికి సెంట్రల్‌లో అవకాశం కల్పించారు. ఇక పశ్చిమ సీటును మైనారిటీకి కేటాయించారు. అనూహ్యంగా షేక్ ఆసిఫ్ పేరును తెరపైకి తెచ్చిన వైసీపీ అధిష్ఠానం.. ముందే అనుకున్నట్టుగా మచిలీపట్నం నుంచి పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తి అలియాస్ కిట్టుకు అవకాశం కల్పించారు.

సీటు



షేక్ ఆసిఫ్ (పశ్చిమ)



వెలంపల్లి శ్రీనివాస్ (సెంట్రల్)



పేర్ని కిట్టు (మచిలీపట్నం)

- సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు హ్యాండ్
- వెలంపల్లికి సెంట్రల్ నుంచి అవకాశం
- పశ్చిమలో అనూహ్యంగా ఆసిఫ్ పేరు
- ముందే అనుకున్నట్టు మచిలీపట్నం పేర్ని కిట్టూకే..
- మంత్రి జోగి రమేశ్‌కు పెడనలో సీటు కష్టమే
- తేల్చిచెప్పిన తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు
- ఎక్కడికక్కడ రగులుతున్న అసంతృప్తి జ్వాలలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ సీట్ల కేటాయింపుల విషయంలో అసంతృప్తులు రగిలిపోతున్నారు. ఓవైపు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు టికెట్ నిరాకరించడంపై ఆయన వర్గీయులు భగ్గుమంటుంటే, మరోవైపు పశ్చిమలో దళితులను గుర్తించకపోవడంపై మండిపడిన కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ త్వరలో రాజీనామా చేస్తానని ప్రకటించారు. మచిలీపట్నంలోనూ సీనియర్ వైసీపీ నాయకులు అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఎలాంటి అనుభవం లేని కిట్టుకి టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే వెలంపల్లికి స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో ఆయన సెంట్రల్ వైపు చూస్తున్నారని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది.

పెడన నుంచి జోగి రమేశ్‌కు నో

మంత్రి జోగి రమేశ్‌కూ టికెట్ లేదన్న అంశంపై వైసీపీ పెద్దలు స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. ఆయన్ను మైలవరం నుంచి పోటీకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జోగి రమేశ్‌కు సీటు ఇవ్వాలంటూ కొద్దిరోజుల క్రితం వైసీపీ పెడన నాయకులు సమావేశం నిర్వహించారు. జోగి రమేశ్ పేరు ఒక్కడిదే చెబితే పస ఉండదని, మచిలీపట్నం ఎంపీ టికెట్ బాలశౌరికి ఇవ్వాల్సిందేనంటూ తీర్మానాలు చేసేశారు. ఈ విషయాన్ని బాలశౌరి సీరియస్‌గా పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాన్ని ఊహించని జోగి రమేశ్ అనుచరులు హడావుడిగా మరోసారి విలేకరులను పిలిచి పొరపాటున ఎంపీ పేరు ప్రస్తావించినందుకు క్షమాపణ చెప్పుకొన్నారు. వాస్తవానికి ఈ హడావుడి జరగకముందే జోగి రమేశ్‌కు టికెట్ లేదన్న అంశంపై వైసీపీ పెద్దలు స్పష్టత ఇచ్చారు.

రంగంలోకి యడ్లపల్లి సుధీర్



జోగి రమేశ్

తనకు సీటు ఇచ్చే అవకాశం లేకపోవడంతో ఇటీవలే జనసేన నుంచి వైసీపీలో చేరిన యడ్లపల్లి సుధీర్‌కు టికెట్ ఇప్పించేందుకు జోగి రమేశ్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. మంగళవారం కూడా ఆయన తాడేపల్లి పెద్దలను కలిశారు. జోగి ప్రతిపాదనపై తాడేపల్లి పెద్దలు సానుకూలంగా స్పందించలేదని సమాచారం.

ఉప్పాల కుటుంబానికి ఇస్తారా..?

ఉప్పాల రాము కానీ, ఆయన సతీమణి, ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్ హారిక కానీ వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలున్నాయని తెలుస్తోంది. జగన్ తన పాదయాత్ర సమయంలో పెడన వైసీపీ టికెట్ ఉప్పాల రాము తండ్రి రాంప్రసాద్‌కు ఇస్తానని మాట ఇచ్చారు. కానీ, 2019 ఎన్నికల్లో సమీకరణాలు కుదరక రాంప్రసాద్‌కు బదులు జోగికి పెడన టికెట్ ఇచ్చారు. ఆ తర్వాత ఉప్పాల రాంప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఇచ్చేందుకు జగన్ సిద్ధపడినా అందుకు ఆయన ఒప్పుకోలేదు. తనకు ఎమ్మెల్సీ వద్దని, తనకు కానీ, తన కుటుంబ సభ్యులకు కానీ ఎప్పటికైనా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత రాంప్రసాద్ కోడలు ఉప్పాల హారికకు జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత మరొకరికి జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చేలా ముందే ఒప్పందం ఉండటం, అది 2024 తొలిభాగంలోనే పూర్తికానుండటంతో ఉప్పాల కుటుంబం ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తోంది. రాంప్రసాద్ మృతిచెందడంతో ఆయన కుమారుడు రాము లేదా కోడలు హారికకు టికెట్ దక్కవచ్చని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా మంగళవారం వైసీపీ పెద్దలను కలిశారు. తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే సమీకరణాల దృష్ట్యా అవకాశం కల్పించలేమని, పార్టీ అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని వైసీపీ పెద్దలు చెప్పినట్లు సమాచారం.



ఉరే గతి..!

ఉద్యోగ భద్రత లేదు.. గొడ్డుచాకిరీ చేస్తున్నా వేతనాల పెంపూ లేదు.. రోడ్డెక్కి నినదిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు.. ఇక తమకు ఉరే గతి.. అంటూ నిరసనలు తెలిపారు అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు. మచిలీపట్నంలో మంగళవారం ఇలా వినూత్నంగా ఆందోళన తెలిపారు.

5లోగా విధుల్లోకి రావాలి

అంగన్వాడీలకు కలెక్టర్ ఆదేశాలు

మచిలీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఈనెల 5వ తేదీలోగా విధుల్లో చేరాలని, అలా చేరని వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను, పోషణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అంగన్వాడీలు విధులకు హాజరుకావాలని ఆయన కోరారు.

జడ్పీ సీఈవోకు నెల రోజుల జైలు

ఉద్యోగుల అక్రమ బదిలీ కేసుపై హైకోర్టు ఆగ్రహం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉద్యోగుల అక్రమ బదిలీలపై న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించినందుకు జడ్పీ సీఈవో జ్యోతిబసుకు హైకోర్టు నెల రోజుల జైలుశిక్ష విధించింది. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు ఆయన న్యాయస్థానం ముందు లొంగిపోయారు. అనంతరం కోర్టు ధిక్కరణపై కౌంటర్ దాఖలు చేయగా, హైకోర్టు స్టే ఇచ్చింది.

అవినీతి బదిలీలు..

ఉద్యోగుల ఐచ్ఛిక బదిలీలు మార్గదర్శకాలకు భిన్నంగా జరిగాయి. ఉద్యోగుల సౌకర్యం ప్రకారం బదిలీలను నిర్వహించాల్సింది పోయి, కుటుంబాలను ఇబ్బందులు పాలుచేసేలా కక్షపూరితంగా జరిపారు. అనారోగ్యంగా ఉన్నవారిని కనికరించకుండా తాము పనిచేసే ప్రాంతాల నుంచి వంద కిలోమీటర్ల దూరానికి బదిలీ చేశారు. బదిలీలను క్యాష్ చేసుకోవడంతో పాటు రాజకీయ ఒత్తిళ్లకు కూడా జ్యోతిబసు లొంగిపోయారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో కొందరు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్‌కు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసు మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్‌కు యథాస్థానంలో పోస్టింగ్ కల్పించాలంటూ హైకోర్టు గతంలోనే ఆదేశాలిచ్చింది. జడ్పీ సీఈవో ఇచ్చిన బదిలీ ఆదేశాలను సస్పెండ్ చేసింది. అయినప్పటికీ జడ్పీ సీఈవో స్పందించలేదు. దీంతో బాధితుడు కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు ఆయన్ను ప్రశ్నించింది. ఈ బదిలీలు తాను చేయలేదని, చైర్మన్ చెప్పటం వల్లే చేశానని ఆయన కోర్టుకు వివరణ ఇచ్చారు. దీనిపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. నెల రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ ఆదేశాలిచ్చింది.

జడ్పీ సీసీ వల్లే..

ఈ బదిలీల వ్యవహారంలో జడ్పీ సీఈవో దోషిగా నిలబడటానికి జడ్పీ సీసీనే ప్రధాన కారణం. జడ్పీ చైర్‌పర్సన్ చెప్పారంటూ ఇష్టానుసారంగా బదిలీ చేశారు. సీఈవో జ్యోతిబసును అడ్డంగా ఇరికించారు. ప్రతి పనికీ ఒక రేటు, బదిలీలకు రేటు, డిప్యూటేషన్లకు రేటు, టెండర్లకు రేటు పెట్టి జిల్లా పరిషత్ ప్రతిష్ఠను దిగజార్చారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం.. చివరకు వాహనాల్లో ఇంధనాన్ని కూడా వదల్లేదు. తాజాగా సీఈవోకు కోర్టు జైలుశిక్ష విధించటంతో జడ్పీ పరువు పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

ఆలయాల విశిష్టత తెలిపేదే ఆలయవేదం

» భువనేశ్వరీ పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి

ఆలయంలో ప్రతి భాగం భక్తులకు తెలియాలి

» దేవదాయ శాఖ ఎన్ఆర్ఐ నిధుల విభాగ సమన్వయకర్త వేంకట సత్యబ్రహ్మాచార్య



పండుగలు, ఇతర పర్వదినాల్లోనే కాకుండా ఆయా వారాల విశిష్టతను బట్టి హిందువులు ఆలయాలకు వెళతారు.. ఆలయానికి వెళ్లడం, అక్కడ కొలువైన దేవుడిని దర్శించుకోవడంతో దైవ సందర్శన పూర్తయినట్టు కాదని అంటున్నారు దేవదాయ శాఖ ఎన్ఆర్ఐ నిధుల విభాగ సమన్వయకర్త కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య. ప్రతి ఆలయంలో సుమారుగా 42 ప్రధాన భాగాలు ఉంటాయని, వాటి గురించి భక్తులకు అవగాహన ఉండాలని చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లీషు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఆయన ఆలయాలు, వాస్తు, శిల్పశాస్త్రంపై అనేక పుస్తకాలు రాశారు. తాజాగా 'ఆలయ వేదం', 'శివధర్మశాస్త్రం' పుస్తకాలను రాశారు. ఈ పుస్తకాల ఆవిష్కరణ పుస్తక మహోత్సవంలో మంగళవారం జరిగింది. ఈ పుస్తకాల సారాంశాన్ని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

? ఆలయ వేదం పుస్తకం రాయడానికి కారణం

వేదం అంటే తెలుసుకోదగినది అని అర్థం. ఆలయ వేదం అంటే.. ఆలయం గురించి తెలుసుకోవడం. ప్రతి ఆలయంలో గోపురం నుంచి ధ్వజస్తంభం వరకు కొన్ని ప్రధాన భాగాలు ఉంటాయి. వాటి గురించి ఆలయంలో ఉండే అర్చకులకు మాత్రమే కాదు భక్తులకూ తెలియాలి. అందుకోసమే ఈ పుస్తకం రాశాను.

? ఆలయాలకు ఎన్ని ప్రధాన భాగాలు ఉంటాయి

ప్రతి ఆలయానికి సుమారుగా 42 ప్రధాన భాగాలు ఉంటాయి. ఇందులో ఒకటి ఊర్ధ్వస్థితం.. అంటే గర్భాలయం నుంచి పై వరకు ఉండేది. రెండోది శైనాలయం.. అంటే తల భాగం నుంచి నాభి వరకు ఉండేది. దీన్నే ప్రసాదపురుషుడు అని అంటారు. వాటి గురించి భక్తులకు ఒక అవగాహన ఉండాలి.

? ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు రాశారు

ఇప్పటి వరకు 32 పుస్తకాలు రాశాను. వాటిలో మూడు శిల్ప శాస్త్రంపై రాశాను. మరో మూడు పుస్తకాలు రాశాను. వాటిని ముద్రణ చేయించాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వాస్తు శాస్త్రంపై అనేక పుస్తకాలు ముద్రణ అయ్యాయి. శిల్పశాస్త్రంపై పెద్దగా పుస్తకాలు ప్రచురణ కాలేదు. అందుకే శిల్ప శాస్త్రంపై రాస్తున్నాను.

? ఈ పుస్తకాలు రాయడానికి స్ఫూర్తి ఎవరకు

నేను ఇన్ని పుస్తకాలు రాశానంటే దానికి స్ఫూర్తి నాన్న కందుకూరి గోవిందేశ్వరశర్మ. శిల్పకళా భారతి అనే సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా ఈ పుస్తకాలను ముద్రణ చేయిస్తున్నాం. శిల్ప, ఆగమం, వాస్తు, వేద సాహిత్యం విభాగాల్లో పుస్తకాలను రాసి ప్రచురణ చేయిస్తున్నాం.

- విజయవాడ సిటీలైఫ్ (ఆంధ్రజ్యోతి)

విజయవాడ కల్చరల్, జనవరి 2 : దేవాలయాలకు వెళ్లినప్పుడు వాటి నిర్మాణాలను, శిల్పాలను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని భువనేశ్వరీ పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి సూచించారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఆరో రోజు మంగళవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన మొదటి సభలో కందుకూరి వెంకట సత్య బ్రహ్మాచార్య రచించిన 'ఆలయవేదం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగంలో భాగంగా మన ప్రాచీన శాస్త్రాల ప్రకారం నిర్మించిన ఆలయాలు, చెక్కిన శిల్పాలు సూక్ష్మమైన, సునిశితమైన విశిష్టతలను కలిగి వుంటాయని వివరించారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు తొందర తొందరగా దైవదర్శనం చేసుకొని వచ్చేయడం కాకుండా దేవాలయ నిర్మాణ విశేషాలను తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. దేవాలయ శిల్పానికి సంబంధించి వివిధ భాషల్లో వున్న గ్రంథాలను తెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న సత్య బ్రహ్మాచార్యను అభినందించారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాసులు మొదటి ప్రతి స్వీకరించారు. ఇదే వేదికపై శైవాగమానికి చెందిన శివధర్మశాస్త్రం తెలుగు అనువాదాన్ని శ్రీశైల దేవస్థానం ఆస్థాన దైవజ్ఞులు బుట్టే వీరభద్ర సిద్ధాంతి ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ అంబడిపూడి నాగభూషణం తెలుగులోకి అనువదించి సంపాదకత్వం వహించారు. కె.రామకృష్ణ సభను నిర్వహించారు. ఎ.గోవర్ధన శాస్త్రి, భవిరి రవి ధ్వన్యనుకరణ నిపుణులు సభలో పాల్గొన్నారు.



ఆలయవేదం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కమలానంద భారతి స్వామి, సత్యబ్రహ్మాచార్య తదితరులు





మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

ఆత్మానందమే జీవిత పరమార్థం

ఆత్మానందమే మానవ జీవత పరమార్థమని చిత్రకారుడు, రచయిత, కళావిమర్శకుడు సంజీవ్ దేవ్ జీవించి నిరూపించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై రెండో సభగా కే.శే. సంజీవదేవ్, ఆవంత్స సోమసుందర్‌ల శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, మన చుట్టూ వున్న ప్రకృతిలోను, కళలలోను వున్న సౌందర్యాన్ని ఆస్వాదించడం తద్వారా ఆత్మానందాన్ని అనుభవించవచ్చునని పేర్కొన్నారు. హిమాలయాల సౌందర్యంతో గాఢంగా అనుభూతి చెంది, సౌందర్యాస్వాదనను ఆత్మాన్వేషణగా మార్చుకున్న వ్యక్తి సంజీవ దేవ్ అని చెప్పారు. దేశంలో ప్రముఖ కళాకారులు కవులతో కలిసి స్నేహపూర్వకంగా జీవించిన వ్యక్తిగా సంజీవ్ దేవ్ అనేక విషయాల మీద సాధికారికంగా మాట్లాడేవారు, రాయగలిగే వారని చెప్పారు.

తెలుగు వచన కవిత్వానికి సోమసుందర్ సేవలు మరువలేనివని జీవితాంతం తెలుగులో కవిత్వాన్ని రచించి, ప్రచురించి, ప్రచారం చేసిన కవి ఆవంత్స సోమసుందర్ అని సభాధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ వివరించారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆవంత్స సోమసుందర్ కవిత్వ శక్తిని తెలుసుకోవాలంటే ఆయన వజ్రాయుధం కవిత్వ సంకలనాన్ని చదవాలని జోస్యుల కృష్ణబాబు చెప్పారు. తెలంగాణా సాయుధ పోరాటానికి ఎంతో ఊపు తెచ్చిన ఆ కావ్యాన్ని అప్పటి ప్రభుత్వం నిషేధించడం ఆయన కవిత్వం ప్రజలలో కలిగించిన ఉత్తేజానికి తార్కాణమన్నారు. ఆధునిక సాహిత్యంలో అనేక మలుపులను అందుకుంటూ భావకవిత్వ సౌందర్యాన్ని, అభ్యుదయ కవిత్వ చైతన్యాన్ని మేళవించి ప్రజల వద్దకు తీసుకెళ్లిన ఘనత సోమసుందర్‌దేనన్నారు. మాక్సీం గోర్కీ అమ్మ నవలను తెలుగులోకి అనువదించారని చెప్పారు.



జీవనస్పర్శ నవలను ఆవిష్కరిస్తున్న వి.కృష్ణయ్య, కె.ఉషారాణి తదితరులు

సమాజానికి సాహిత్యమే దిక్సూచి

సమాజానికి సాహిత్యమే దిక్సూచి అని సమాజంలో జరుగుతున్న మార్పులు రావాలంటే ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత రచయితలకూ సాహిత్యానికి వుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై గనారా రచించి సాహితీ స్రవంతి ప్రచురించిన 'జీవన స్పర్శ' నవలను ఆయన ఆవిష్కరించారు. ఈ నవల గత 30-40 ఏళ్లల్లో వచ్చిన సామాజిక మార్పులను చక్కగా అద్దం పట్టిందన్నారు. అధికారంలో ఉన్న వారు తమ అధికారాన్ని కాపాడుకొనేందుకు వాస్తవాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం సర్వసాధారణమైన ఈ కాలంలో వాటిని పరోక్షంగానూ, వ్యాఖ్యానపూరితంగానూ అందించాల్సిన బాధ్యత సాహిత్యకారులదేనన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకురాలు కె.ఉషారాణి పుస్తకాన్ని పరిచయం చేస్తూ ప్రేమకథా నేపథ్యంలో సామాజిక మార్పులను, సంఘర్షణలను చక్కగా చిత్రీకరించారని వివరించారు. 70వ దశాబ్దంలో ఉద్యోగుల జీవితాలలో వచ్చిన మార్పులను, అంతఃసంఘర్షణను ఆద్యంతం ఆసక్తికరంగా చర్చించారని చెప్పారు. ఆధునిక జీవితంలో సాహిత్యానికి స్థానం తగ్గిపోవడం విచారకరమని సభకు అధ్యక్షత వహించిన వరప్రసాద్ అభిప్రాయపడ్డారు. సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ, ఒక మనిషి వ్యక్తిగత జీవితానికి, ఉద్యోగ జీవితానికి, సామాజిక జీవితానికి మధ్య జరిగే సంఘర్షణను రచయిత హృద్యంగా చిత్రీకరించారన్నారు.



కొసరాజు సినీ సాహిత్య వ్యాసావళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మద్దుకూరి విజయకుమార్ తదితరులు

జానపద గేయాల రచనకు రారాజు కొసరాజు

జానపద గేయ రచనలలో కొసరాజు రారాజు అని, పల్లె ప్రజలలోని అమాయకత్వాన్ని, చైతన్యాన్ని తన గేయాలలో వాళ్ల భాషలోనే ప్రతిఫలింపచేసిన ఘనత కొసరాజు రాఘవయ్య చౌదరికే దక్కుతుందని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై మంగళవారం నిర్వహించిన చివరి సభలో మద్దుకూరి విజయ చంద్రహాస్ రచించిన 'కొసరాజు సినీ సాహిత్య వ్యాసావళి' పుస్తకాన్ని ఆయన తండ్రి మద్దుకూరి విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, తన పాటలలో శోకం, హాస్యం మిళాయించడం, సంభాషణాత్మక పాటలు కొసరాజు ప్రత్యేకత అని ఆయన వివరించారు. సినీసాహిత్య స్వర్ణయుగానికి కారణమైన గేయ రచయితల్లో కొసరాజు ప్రముఖులన్నారు. కొసరాజు గేయాల విశిష్టతను, చారిత్రక నేపథ్యాన్ని వివరించడంలో పుస్తక రచయిత చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. హాస్య పాత్రలకు పాటలు రాయడం వల్ల కొసరాజుకు దక్కాల్సినంత సాహిత్య గౌరవం దక్కలేదని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షత వహించిన ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడుతూ కల్మషం లేని సామాజిక చైతన్యాన్ని, చక్కని చిక్కని తెలుగు పదాలను తన పాటలతో అజరామరం చేసిన ఘనత కొసరాజుదేనన్నారు.

నేడు సా.6 గంటలకు ఎన్‌బీటీ సంస్థ ఇండియా పిల్లల పుస్తకావిష్కరణ సభ, 7, 8 గంటలకు విశాలాంధ్ర పుస్తకావిష్కరణలు

ఆంగ్ల పుస్తకాలకు అధిక ప్రాధాన్యం

» పుస్తక మహోత్సవంలో కొత్త ఒరవడి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) పుస్తక మహోత్సవంలో ఈ ఏడాది కొత్త ఒరవడి కనిపిస్తోంది. పుస్తక మహోత్సవానికి వస్తున్న పాఠకుల్లో ఎక్కువ మంది ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. అటు పెద్దలు గానీ, ఇటు చిన్న పిల్లలు గానీ తెలుగు పుస్తకాలంటే ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. పుస్తక మహోత్సవానికి తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని వస్తున్నాయి. ఇప్పుడు ఎక్కువ మంది పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం సాగిస్తున్నందున తల్లిదండ్రులు ఇంగ్లీష్ పుస్తకాలను కొని ఇస్తున్నారు. ఇక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిప్లమో కోర్సులను చేస్తున్న విద్యార్థులు ఈ పుస్తకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలే కాకుండా ఇంగ్లీష్ వివిధ ప్రముఖులు రాసిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. సాహిత్య పుస్తకాలను చదివే అభిలాష ఉన్న వాళ్లు ఆంగ్ల సాహిత్య పుస్తకాలను తీసుకుంటున్నారు. సాధారణంగా ఇంగ్లీష్ మీడియం చదువుతున్న చిన్నపిల్లలు కథల పుస్తకాలను కొనుగోలు చేయడం కనిపిస్తోంది. తల్లిదండ్రులు ఆయా బుక్ స్టాల్స్‌లో తిప్పుతూ ఇంగ్లీష్ సాహిత్య పుస్తకాలను చూపించి పిల్లల అభిరుచికి తగిన పుస్తకాలను కొనిపిస్తున్నారు. కొన్ని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు పుస్తక మహోత్సవంలో కొనుగోలు చేయాల్సిన పుస్తకాల పేర్లను రాసి ఇస్తున్నారు. తల్లిదండ్రులకు చెప్పి ఆ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలు, యువతులు సైతం ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన పుస్తక మహోత్సవాల్లో ఇలాంటి ఒరవడి కనిపించలేదని స్పష్టం చేస్తున్నారు. గడచిన ఏడాది ఎక్కువగా తెలుగు సాహిత్య పుస్తకాలను కొనుగోలు చేశారని, ఈసారి మాత్రం పాఠకులు ట్రెండ్ మార్చారని చెబుతున్నారు.

యోగా పుస్తకాలంటే ఇష్టం : మునివర యోగి



పుస్తకం, యోగా... రెండూ ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. అందుకే నేను యోగాకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదువుతా. యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నందున దానివల్ల వృత్తికి దగ్గరగా ఉన్న పుస్తకాలను చదువుతా. పతంజలి యోగా సూత్ర వంటి పుస్తకాలను తరచుగా చదువుతుంటా. యోగాపై వివిధ గురువులు రాసిన పుస్తకాల్లో తత్వం బోధపడుతుంది.

గంటలో ఇంగ్లీష్ నేర్చుకోండి..

ఇంగ్లీష్.. ఇప్పుడు అందరికీ అవసరమైన ఆయుధంగా మారింది. ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ఇంగ్లీష్ నేర్చుకుంటున్నారు. ఇంగ్లీష్‌లో సరళంగా మాట్లాడడంతో పాటు రాయడానికి వీలుగా స్టాల్ నంబరు 58లో ఉన్న స్నేహ గ్రూపు అందుబాటులో ఉంచింది. ఒక్క గంటలో ఇంగ్లీష్ నేర్చుకోండి.. పేరుతో పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. రెండు పుస్తకాలను ఒక సెట్‌గా విక్రయిస్తున్నారు. ఒక్కో పుస్తకం ఖరీదు రూ.20లు. ఆరు పుస్తకాలు ఉన్న మరో సెట్‌ను రూ.100లకు విక్రయిస్తున్నారు.

చైనా ముద్రణలు

చూడటానికి పుస్తకాలు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వాటిని పట్టుకోగానే తెలియని అనుభూతి కలుగుతుంది. ప్రతీ పుట ఎంతో సున్నితంగా ఉంటుంది. పుస్తకాల విక్రయాలు ఇక్కడ జరుగుతున్నా, వాటి ముద్రణ మాత్రం చైనాలో జరిగింది. విశాలాంధ్ర బుక్‌హౌస్ స్టాల్‌లో ఈ చైనా ముద్రణ పుస్తకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగులో చందమామ కథలు, మహాభారతం, బొమ్మ చెప్పిన కథలు, అతిలోక కథలు పుస్తకాలతోపాటు ఇంగ్లీష్‌లో ది రామాయణ్, ది మహాభారతం పుస్తకాలను చైనాలో ముద్రణ చేయించారు. కొనుగోలు విషయం ఎలా ఉన్నా ఈ పుస్తకాలను తిలకించడానికి పాఠకులు ఎగబడుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

» కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా



మాట్లాడుతున్న రూపాలా

మచిలీపట్నం టౌన్, జనవరి 2 : మత్స్యకారుల సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకు వెళ్లి మెరుగైన పథకాలతో మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర మత్స్యకార, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా అన్నారు. సాగర్ పరిక్రమ-ప్రోగ్రాం ఫేస్ 10లో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం గిలకలదిండిలో నూతనంగా నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద ఇద్దరు ఎస్సీ, ఒక ఎస్టీ లబ్దిదారులకు వాహనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి సంక్షేమ పథకాల కింద మత్స్యకారులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణ సమస్యను పరిష్కరించాలని కమిటీ ప్రతినిధులు సోడిశెట్టి బాలాజీరావు, పీవీ ఫణికుమార్ తదితరులు కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేశారు. డా.ఎల్.ఎన్. మూర్తి, ఆంథోనీ జెవిఎల్, వి.శ్రీనివాసరావు, సంజయ్ పాండే, జెడీ ఎన్. శ్రీనివాసరావు, ఆర్డీవో ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

జిల్లాలో రసాయన విపత్తు నిర్వహణకు చర్యలు

» పారిశ్రామిక స్పందన కమిటీ సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 2 : జిల్లాలోని పరిశ్రమల్లో రసాయన విపత్తు నిర్వహణకు సంబంధించి అనుభవమున్న సంస్థతో ఆఫ్‌సైట్ అత్యవసర ప్రణాళిక (ఓఈపీ)కు రూపకల్పన చేయనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పారిశ్రామిక అత్యవసర స్పందన కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆఫ్‌సైట్ అత్యవసర ప్రణాళిక రూపకల్పనపై వివిధ శాఖల అధికారులు, సంస్థల ప్రతినిధులు సభ్యులుగా గల కమిటీ చర్చించింది. కలెక్టర్ ఢిల్లీరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, సభ్యులతో కలిసి ప్రణాళిక రూపకల్పన బాధ్యతలను చోళమండలం ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ లిమిటెడ్ (చెన్నై)కు అప్పగించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో భారీ ప్రమాదాలు జరిగేందుకు అవకాశమున్నవి (మేజర్ యాక్సిడెంట్ హజార్డ్స్) ఎనిమిది పరిశ్రమలున్నాయని, పరిశ్రమల్లో విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలు కల్పించే ఆఫ్‌సైట్ అత్యవసర ప్రణాళిక రూపకల్పనకు చోళమండలం ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ లిమిటెడ్‌ను కమిటీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. ముసాయిదా ప్రణాళిక ఆధారంగా మాక్‌డ్రిల్ నిర్వహించడం జరుగుతుందని, ఆ తర్వాత తుది ప్రణాళికను ఖరారు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వో ఏపీ శంకరరావు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ టి.రాజు, ఐఓసీఎల్ టెర్మినల్ (కొండపల్లి) ప్లాంట్ హెడ్ ఐ.శ్రీనివాస్, బీపీసీఎల్ ప్లాంట్ హెడ్ సుభాష్‌చందు, హెచ్‌పీసీఎల్ టెర్మినల్ (కొండపల్లి) ప్లాంట్ హెడ్ బి.రాజశేఖర్, ఎన్‌టీటీపీఎస్ (కొండపల్లి) ప్లాంట్ హెడ్ ఎం.నాగబాబు, ఐఓసీఎల్ బాట్లింగ్ ప్లాంట్ హెడ్ బి.రామారావు, గెయిల్ ఇండియా ప్లాంట్ హెడ్ ఎం.శ్రీనివాసులు, హెచ్‌పీసీఎల్ ప్లాంట్ హెడ్ ఎం.నితిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

కృష్ణలంక, జనవరి 2 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు జిల్లాలో ప్రణాళిక ప్రకారం జరుగుతున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న పోటీలను కలెక్టర్ పరిశీలించారు. క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మట్టిలో మాణిక్యాలను గుర్తించి, వారిని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దాలనే ఉన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. యువత క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచకుంటే ఉరితాళ్లే గతి

» అంగన్వాడీ, సర్వశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



చెట్టుకు ఉరితాళ్లు బిగించి సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, జనవరి 2 : జీతాలు పెంచకుంటే తమకు ఉరితాళ్లే శరణ్యమని అంగన్వాడీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు స్పష్టం చేశారు. మంగళవారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద 22వ రోజు నిరసన ప్రదర్శనలో అంగన్వాడీ కార్యకర్తలు చీరలతో ఉరితాళ్లు బిగించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అంగన్వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, ప్రాజెక్టు సంఘ ప్రధాన కార్యదర్శి రజీనారాణి కార్యక్రమానికి నాయకత్వం వహించారు. శిబిరంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వైనరసింహారావు మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు 22 రోజులుగా సమ్మె చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు లేదన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చేయాలన్నారు. కృష్ణా జిల్లా కన్వీనర్ టి.తాతయ్య, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన ప్రదర్శన

జీతాలు పెంచకుంటే ఉరితాడే గతి అంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద 14వ రోజు రిలే నిరాహార దీక్షా శిబిరంలో మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ నేత పోతురాజు మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కుటుంబాన్ని పోషించడం భారమవుతోందన్నారు. ఎన్నికల్లో జీతాలు పెంచుతానని సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వాగ్దానం నిలుపుకోవాలన్నారు.

అణచివేత చర్యలు మాని.. హామీలు అమలు చేయండి

విద్యాధరపురం : అంగన్వాడీ, సర్వశిక్షాభియాన్, మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అణచివేత చర్యలు మాని ఆచరణలో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు, బొండా ఉమామహేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా గద్దె అనురాధ, అంగన్వాడీల రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీతలు ధర్నాచౌక్‌లో మంగళవారం దీక్షా శిబిరాలను సందర్శించి ఆందోళనలకు సంఘీభావం తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు చెప్పారు. పండుగలు సైతం సమ్మెలోనే గడిచిపోయాయని, ఇల్లు, వాకిలి వదిలి తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన శిబిరాలలో ఆందోళన చేస్తున్నారన్నారు. కార్మికులు సమ్మె చేస్తుంటే వారితో మాట్లాడే తీరిక కూడా ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు.

భవానీ దీక్షల విరమణకు పటిష్ట ఏర్పాట్లు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వన్‌టౌన్, జనవరి 2 : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న భవానీదీక్షల విరమణలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి మూడు రోజులు రోజుకు 50 వేల చొప్పున ,శని, ఆదివారాలలో రోజుకు లక్ష మంది చొప్పున భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. స్నాన ఘాట్ల వద్ద 800 షవర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కేశఖండన శాలలు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిసరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు. తాత్కాలిక వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కనకదుర్గనగర్‌లో 11 లడ్డూ ప్రసాదాల విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు కొండ పైన, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద అదనంగా ప్రసాదం విక్రయ కౌంటర్లు ఉంటాయన్నారు. 10 లక్షల మంచినీటి ప్యాకెట్లను సిద్ధం చేసి ఉంచినట్టు తెలిపారు. ఇరుముడుల స్వీకరణకు 90 స్టాండ్లు ఏర్పాటు చేశామని రిజర్వ్‌లో మరో 10 ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ 5 నుంచి 6వేల మందికి అన్న ప్రసాదాన్ని అందించనున్నట్లు చెప్పారు. భవానీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితీ సింగ్, ఆలయ ఈవో కేఎస్ రామారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు రూ.300, రూ.100 దర్శనం టికెట్లు అందుబాటులో ఉంటాయని, రెండు క్యూలు ఉచిత దర్శనం కోసం ఉంటాయని ఆలయ ఈవో రామారావు చెప్పారు. రూ.300 టికెట్ భక్తులకు బంగారు వాకిలి దర్శనం ఉంటుందని తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు పున్నమి ఘాట్, వీఎంసీ కార్యాలయం నుంచి బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేవస్థానంలో ఉన్న 150 మంది సెక్యూరిటీ సిబ్బందితో పాటు అదనంగా మూడువందల మందిని నియమించినట్టు చెప్పారు. 157 మంది దేవస్థాన పారిశుద్ధ్య సిబ్బంది, అదనంగా 150 మందితో పాటు కార్పొరేషన్ ద్వారా మరో 800 మందితో పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతుందన్నారు. మొత్తంగా 255 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్‌లను రథం సెంటర్ వద్ద వీఎంసీ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్త్రీలకు దుస్తులు మార్చుకునేందుకు తగు ఏర్పాట్లు చేసామన్నారు.

భవానీదీక్షల విరమణల సందర్భంగా విద్యుద్దీప శోభతో ఇంద్రకీలాద్రి వెలుగొందుతోంది. రాజగోపురం, మహామండపం తదితరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. దుర్గగుడి పరసర ప్రాంతాలలో అన్ని మార్గాల్లో లైట్లను ఏర్పాటు చేశారు. అగ్ని మాపక సిబ్బంది మంగళవారం సాయంత్రానికి విధుల్లోకి చేరారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మొవ్వ పద్మ

సెంటినీ సిటీలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

» హాస్పిటల్ ఎండీ, చైర్మన్ డాక్టర్ మొవ్వ పద్మ

మాచవరం, జనవరి 2 : పదిమందికి పైగా సూపర్ స్పెషాలిటీ వైద్యుల పర్యవేక్షణలో సెంటినీ సిటీ హాస్పిటల్ వైద్యసేవలు నేటినుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని సెంటినీ హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్, చైర్మన్ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. సూర్యారావుపేటలోని కాశేశ్వరరావు రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన సెంటినీ సిటీ హాస్పిటల్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 12 సంవత్సరాలుగా సెంటినీ హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నామన్నారు. 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులచే ప్రజలకు చేరువగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. నగరంలోనే తొలిసారిగా స్టార్ క్లాస్ డీలక్స్ రూమ్స్‌తో 24 గంటలు రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. క్రిటికల్ కేర్ సర్వీసులు, పల్మనాలజీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, జనరల్, లేప్రోస్కోపి సర్జరీ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు. మూడు ల్యామినరీ థియేటర్లలో అత్యాధునిక క్యాత్‌ల్యాబ్, 1.5 టెస్లా ఎమ్మారై వంటి సౌకర్యాలన్నీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసినట్టు డాక్టర్ మొవ్వ పద్మ పేర్కొన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మొవ్వ ఆనంద్, డైరక్టర్ మొవ్వ విష్ణు, సీఈవో సీఎల్ఎన్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

గుణదల : ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణలు జరుగుతున్న నేపథ్యంలో నగర ప్రజలకు అవాంతరాలు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నట్టు నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా తెలిపారు. నగర ప్రజలు, భవానీలు ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించాలని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వాహనాల పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించడం జరిగిందన్నారు. హైదరాబాద్-విశాఖపట్నం రూట్లలో, చెన్నై-హైదరాబాద్ రూట్లలో వాహనాలను ఇతర మార్గాల నుంచి మళ్లించనున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే ఆర్టీసీ బస్సులు యథావిధిగా గొల్లపూడి వై జంక్షన్-స్వాతి జంక్షన్-కనకదుర్గ ఫ్లైఓవర్-రాజీవ్ గాంధీ పార్క్-పీఎన్‌బీఎస్ చేరుకోవాల్సి ఉంటుందన్నారు. విజయవాడ సిటీబస్టాండ్ నుంచి ఇబ్రహీంపట్నం, భవానీపురం, పాలప్రాజెక్టు, వైఎస్ఆర్ కాలనీ వైపు వెళ్లే ఆర్టీసీ సిటీ బస్సుల మళ్లింపునకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు. కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి లేదా చిట్టినగర్ టన్నెల్ నుంచి గాని భవానీపురం వైపునకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. కుమ్మరిపాలెం నుంచి ఘాట్ రోడ్, ఘాట్ రోడ్ నుంచి కుమ్మరిపాలెం వైపునకు ఏవిధమైన వాహనాలను అనుమతించేది లేదన్నారు. తాడేపల్లి -విజయవాడ వైపు ప్రకాశం బ్యారేజి మీదుగా ఏ విధమైన వాహనాలు అనుమతించబడవన్నారు. హైకోర్టు, సెక్రటేరియట్ వెళ్లాల్సిన ఉద్యోగులు కనకదుర్గమ్మ వారధి మీదుగా వెళ్లాలని చెప్పారు. కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులు వారి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించడం జరిగిందన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాలని, లేదంటే చర్యలు తప్పవని చెప్పారు. గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో కార్లు పార్కింగ్‌కు కేటాయించడం జరిగిందన్నారు. కుమ్మరిపాలెం వద్దగల లోటస్ ల్యాండ్ అపార్ట్‌మెంట్ వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉంటుందని చెప్పారు. బస్సులు, కార్లు పున్నమి ఘాట్, భవానీ ఘాట్, పాత పోమ కంపెనీ వారి స్థలం, సితార సెంటర్, బీఆర్టీఎస్ రోడ్, గాంధీనగర్ జింఖాన గ్రౌండ్స్, వద్ద పార్కింగ్ చేసుకుని అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

మద్యం అక్రమంగా తరలిస్తున్న ఒకరి అరెస్టు


పట్టుకున్న మద్యం సీసాలు

గన్నవరం, జనవరి 2: మద్యం అక్రమంగా తరలిస్తున్న ఒకరిని పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సీఐ కనకా రావు ఆధ్వర్యంలో పోలీస్ చెక్‌పోస్టులను తనిఖీ చేస్తుండగా కేస రపల్లికి చెందిన శివాజీ 49 క్వార్టర్ సీసాలను తీసుకు వెళుతుండగా పట్టుకు న్నారు. అతనితో పాటు ద్విచక్రవాహనం, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు శ్రీనివాస్, నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో
నేటి నుంచి ఆటల పోటీలు

గన్నవరం, జనవరి 2 : గన్నవరం ఎన్టీఆర్ పశు వైద్య కళాశాలలో బుధవారం నుంచి 12వ అంతర్ కళాశాలల ఆటల, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తు న్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ తెలిపారు. శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యా లయం పరిధిలోని నాలుగు కళాశాలలు, ఒక డెయిరీ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొం టారని, అంతర్ కళాశాలల పోటీలను ఐఏఎస్ గోపా లకృష్ణ దివ్వేది, విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ వి.సంపత్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు.

గాయపడ్డ యువకుడి మృతి

హనుమాన్‌జంక్షన్, జనవరి 2: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరుగొలను వద్ద గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓగిరాల గ్రామానికి చెందిన కఠారి దుర్గా ప్రసాద్(24) విజయ వాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగ ళవారం మృతి చెందాడు. ఎస్సై ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న గుడి వాడ రోడ్డులో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో దుర్గా ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త..


జోసఫ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గన్నవరం, జనవరి 2 : మండలంలోని బల్లిపర్రుకు చెందిన టీడీపీ కార్యకర్త తొమ్మండ్రు జోసఫ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం టీడీపీ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, మండవ లక్ష్మి, చీమలదండు రామకృష్ణ, మండవ అన్వేష్, షేక్ అబుల్యాజ్, ఆరు మళ్ల కృష్ణారెడ్డి, జొన్నలగడ్డ సుధాకర్, చిట్టూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని నివాళుల ర్పించారు. జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జోసఫ్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని, మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు.

నిడమానూరు మాజీ సర్పంచ్
పరిమి రమేష్ మృతి


పరిమి రమేష్ (ఫైల్)

గుణదల, జనవరి 2: అనారోగ్యంతో బాధపడు తున్న నిడమానూరు మాజీ సర్పంచ్ పరిమి రమేష్ (64) మంగళ వారం ఉదయం మృతి చెందారు. ఆయ నకు భార్య గోవర్దనతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిడమానూరుకు సర్పంచ్‌గా గ్రామానికి 2001 నుంచి 2006 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున పనిచేశారు. కుమార్తె అమెరికాలో స్థిరపడింది. కుమారుడు గ్రామంలో ప్రజాసేవలో ఉన్నారు. కుమార్తె అమెరికా నుంచి రావాల్సి ఉంది. దీంతో రమేష్ అంత్యక్రియలు ఈ నెల 4న నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు.

పశువులకు గాలికుంటు
వ్యాధి నివారణ టీకాలు

ఉయ్యూరు, జనవరి 2 : పశువులలో గాలికుం టు వ్యాధి నివారణకు ఉచిత సామూహిక నివారణ కార్యక్రమం ఈ నెల 30 వరకు నిర్వహి స్తున్నట్లు ఉయ్యూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు ఎం రామశేఖర్ తెలిపారు. స్థానిక పశువైద్యశా లలో మంగళవారం పశువులకు గాలికుం టు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభించారు.

● సోమేశ్వరస్వామి ఆలయం గోశాలలో గోవులకు ఛైర్మన్ కుటుంబరాజు టీకాల కార్యక్రమం ప్రారంభించారు.

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్


పోరంకిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

తాడిగడప (పెనమలూరు), జనవరి 2 : రాష్ట్రంలో అన్ని రంగాల్లో పాలన గాడి తప్పిందని పాలనను గాడిలో పెట్టాలంటే చంద్రబాబు నాయుడుకే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలంలోని తాడిగడప మునిసిపాలిటి పరిధిలోని పోరంకి 4వ వార్డులో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్, మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. దాచుకోవడం.. దోచుకో వడం మినహా రాష్ట్రానికి జగన్ మోహన్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమం లో అనుమోలు ప్రభాకర్, బొప్పన లావణ్య, చక్రవర్తి, సెంగెపు రంగా రావు, అబ్రహం, షేక్ సలీం పాల్గొన్నారు.

తాడిగడపలో..


తాడిగడపలో బోడె హేమ తదితరులు

మండలంలోని తాడిగడప కట్టపై మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడసాని రత్నకుమారి, రేఖ, నాగమణి, కనకదుర్గ, ప్రమీళ, తుమ్మల రామ్‌కుమార్, గోపీ చంద్, మన్నే రాజాబాబు, నాగుల్‌మీరా, మేడసాని వెంకటేశ్వరరావు, పామర్తి సిద్ధయ్య, కిలారు రవివర్మ, దామోదర్, కందుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో..

వేల్పూరు (కంకిపాడు) : బాబూ ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీపై మండలంలో విస్తృత ప్రచారం చేపట్టామని టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అన్నారు. మండలంలోని వేల్పూరులో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు అన్నే ధనయ్య, కొణతం సుబ్రహ్మణ్యం, చలసాని బుజ్జి, పామర్తి ప్రసాద్, రామారావు, అజయ్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో సుదిమళ్ల రవీంద్ర..

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం, జనవరి 2 : విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని హెచ్‌ఎం దుగ్గిరాల ఝాన్సీరాణి అన్నారు. స్థానిక బాలి కల జడ్పీహైస్కూల్ విద్యార్థినులు తెనాలిలో జరిగిన అంతర్‌జిల్లాల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఎస్‌వి భార్గవి, వి. కైరునున్నీసా(10వ తరగతి) పాల్గొని చక్కటి ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధిం చారు. అలాగే అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 విభాగాల్లో రాష్ట్రస్థాయిలో టంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో మానికొండ సాయి సత్య చిన్మయ్ (8వ తరగతి) దొంతు మాద్వితను ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించి బంగారు పతకాలు అందుకున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. వీరిని మంగళవారం అభినందిం చారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ గీతా, శివ చైతన్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలి

హనుమాన్‌జంక్షన్, జనవరి 2 : పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే విధంగా బోధన సాగాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబో యిన కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, నైతిక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మారుబోయిన నైతిక విలువలపై విద్యార్థు లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గతేడాది 6,7,8,9 తరగతుల్లో మెరిట్ సాధించిన విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం టీవీ.నాగేశ్వరరావు సుంకర సుభాష్‌చంద్రబోస్, కూరెళ్ల సుబాచారి, కళ్లేపల్లి నారాయణరావు, వడ్డి రాజే శ్వరరావు, దయాల ప్రభాకర్‌రావు, జేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన మునిసిపల్ కార్మికులు


ఉయ్యూరులో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు

ఉయ్యూరు, జనవరి 2 : మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి. రాజేశ్ ఆరోపించారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం సమీపాన ఉన్న గాంధీ విగ్రహానికి కార్మికులు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చింతయ్య, బాలకృష్ణ, కమిటీ సభ్యులు సుజాత, దుర్గమ్మ, శివయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేత కృష్ణబాబుకు ఘననివాళి


కృష్ణబాబు అంతిమయాత్రలో టీడీపీ నేతలు.. కృష్ణబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు (ఇన్‌సెట్‌లో)

ఉంగుటూరు, జనవరి 2 : మానికొండ గ్రామాన్ని అభివృద్ధి చేయటంలో కృష్ణ బాబు కుటుంబం కీలకపాత్ర పోషించిందని పలువురు నాయకులు అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మానికొండ మాజీ సర్పంచ్ గోగినేని కృష్ణబాబు పార్థి వదేహాన్ని మంగళవారం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మో హన్, మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు తదితర నేతలు సందర్శించి, పార్టీజెండాను కప్పి, పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కృష్ణబాబు బావ, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుకు, కుమార్తె అపర్ణకు తమ ప్రగాఢ సాను భూతిని తెలిపారు. అనంతరం జరిగిన వీడ్కోలు సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ, కృష్ణబాబుతోపాటు భార్య అమ్మాజీ, సోదరుడు రంగబాబు సర్పంచ్ లుగా పనిచేసి గ్రామానికి విశేష సేవలందించారన్నారు.

అశ్రునయనాలతో కృష్ణబాబుకు అంతిమ వీడ్కోలు

మానికొండ టైగర్ అని అభిమానులు ముద్దుగా పిలుచుకునే గోగినేని కృష్ణబాబుకు అంతిమ వీడ్కోలు పలికేందుకు పలువురు రాజకీయ ప్రముఖులు, టీడీపీ నాయ కులు, కార్యకర్తలతోపాటు పరిసర గ్రామాలనుంచి పెద్దఎత్తున అభిమానులు తర లివచ్చారు. టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, కుర్రా నరేంద్ర, మండవ లక్ష్మి, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, జాస్తి వెంకటేశ్వరరావు, పొట్లూరి బసవారావు, కాకాని శ్రీనివాసరావు, గోగినేని ధనశేఖర్, కోగంటి ప్రసాద్, గ్రామ ప్రముఖులు ఆరికట్ల రవి కుమార్, గోగినేని వెంకటేశ్వరరావు, బాలాజీ, పార్వతీశ్వరరావు, వట్టికూటి కిషోర్‌కు మార్ అంతిమయాత్రలో పాల్గొని కృష్ణబాబుకు తుది వీడ్కోలు పలికారు.

గుంతలమయం!

ప్రమాదకరంగా కడవకొల్లు- పొట్లపాడు ఆర్ అండ్ బీ రోడ్డు


గోతులు ఏర్పడి రాళ్లులేచిన రోడ్డు

ఉయ్యూరు, జనవరి 2 : కడవకొల్లు- పొట్లపాడు రోడ్డు గుంతలమయమై వాహన చోద కులు ప్రమాదాలకు గురవుతు న్నారు. ఉయ్యూరు- కాటూరు రోడ్డు నుంచి కడవకొల్లు మీదుగా పొట్ల పాడు వెళ్లే రోడ్డు పొడవునా గుం తలు ఏర్పడి రాళ్లు లేచి ద్విచక్ర వాహనాలు నడిపేవారు ప్రమా దానికి గురై గాయాలపాలవుతు న్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికెనా స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అంగన్వాడీల నిరసన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న డప్పు కళాకారులు

ప్రభుత్వ మొండివైఖరి మారాలి

22వ రోజు కొనసాగిన అంగన్వాడీల నిరసన దీక్షలు

గన్నవరం, జనవరి 2 : అంగన్వాడీల పట్ల ప్రభుత్వ మొండివైఖరి వీడనాడి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగ న్వాడీలు చేస్తున్న ధర్నా మంగళవారంతో 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రోడ్డెక్కి అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే సీఎం జగన్ మోహన్‌రెడ్డి పట్టనట్లు వ్యవహరించటం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టునట్టు కూడా లేదన్నారు. అంగన్వాడీలు కన్నె ర్రజేస్తే ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా పోతాయన్నారు. రమా, కుమారి, లక్ష్మీ, ఆంజనేయులు, సాంబశివరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీలకు డప్పు కళాకారులు సంఘీభావం తెలిపారు.

4న గండిగుంటలో అనఘాష్టమీ వ్రతం

ఉయ్యూరు, జనవరి 2 : గండిగుంట శ్రీగణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ లో ఈ నెల 4న గురువారం మార్గశిర బహుళ అష్టమి పురస్క రించుకుని ఉదయం అనఘాష్టమీ వ్రతం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలి పారు. వివరాలకు 9052033308 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

యలమర్రులో 50 మంది టీడీపీలో చేరిక

పెదపారుపూడి : యలమర్రులో బీసీ సామాజిక వర్గానికి చెం దిన వైసీపీ నాయకులు, కా ర్యకర్తలు 50 మంది మంగళవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ సీని యర్ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ నాయకత్వంలో వర్ల కుమార్ రాజా వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నారాయణ, చంద్రయ్య, రాంబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నున్నలో వీధి కుక్కల స్వైర విహారం

● మూడు రోజుల వ్యవధిలో 15 మందికి గాయాలు
● మాజీ సర్పంచ్ బాధితుడే


కుక్కల దాడిలో గాయపడిన సాత్విక్

విజయవాడ రూరల్, జనవరి 2 : నున్నలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలో 15 మంది కుక్కల దాడిలో గాయాల పాలైయ్యారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడులకు పాల్పడు తున్నాయి. ఇందిరానగర్ కాలనీ, బోడపాడు, చెరువు సెంటర్, వాగు ప్రాంతంతో పాటుగా పలు చోట్ల వీధి కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. వీధి కుక్కల దాడుల్లో సుఫియాన్(15), సాత్విక్(3), రాజారామ్ (5), నందిని(24)లతో పాటుగా మరో 11 మంది కుక్కల దాడిలో గాయాలపాలైయ్యారు. గత రెండు రోజుల క్రితం కుక్కల దాడిలో మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ కూడా గాయపడ్డాడు.

● గ్రామస్తుల బెంబేలు..

మూడు రోజులుగా గ్రామంలో వీధి కుక్కల దాడుల్లో పదుల సంఖ్య లో ప్రజలు గాయాల పాలవడంతో గ్రామ స్తులు బెంబేలెత్తి పోతు న్నారు. వీధి కుక్కల గుంపులు ఉన్న ప్రాంతాల వైపుగా వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు. మహిళలు, చిన్నారులు, బయటకు రావాలంటే బిక్కు బిక్కు మంటూ రావాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామం మొత్తంలో సుమారు 2000 వీధి కుక్కల వరకు ఉన్నాయని ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో అని స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పట్టుకు వచ్చిన కుక్కలను గ్రామ సమీపంలో వదిలి వెళ్లడంతో సమస్య మరి ఎక్కువైందని పంచాయితీ అధికారులు కూడా వీధి కుక్కల సమస్యను పరిష్కరించలేక పోతున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


ఆటో వెంటబడుతున్న కుక్కలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85



వైభవంగా కలశజ్యోతి ఉత్సవం

బంటుమిల్లి : అర్తమూరు గ్రామంలో భవానీ భక్తులు కలశజ్యోతి ఉత్సవం నిర్వహించారు. దీపాలు చేత బట్టుకుని గ్రామ పుర వీధులలో భక్తి శ్రద్ధలతో పాదయాత్ర చేశారు. అర్తమూరు, మణిమేశ్వరం బాసినపాడు గ్రామాలకు చెందిన దాదాపు 350 మంది భవానీలు పాల్గొన్నారు. మేళతాళాలు, కనకడప్పులతో అమ్మవారి భక్తి గీతాలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

మచిలీపట్నం టౌన్, జనవరి 2 : ప్రజల హక్కులను కాలరాసే భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు మంగళవారం జిల్లా కోర్టు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ న్యాయవాదులు చట్టం రద్దు కోరుతూ 15 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. నిరసన ప్రదర్శనలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురామ్, సీనియర్ న్యాయవాదులు డి. పోతురాజు, మహమ్మద్ రఫీ, పుప్పాల శివరామకృష్ణప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, జవహర్‌లాల్, పాము కొండయ్య, రియాజ్, అజ్మతున్నీసా, న్యాయవాదుల గుమాస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ వేధింపులను నిరసిస్తూ మొవ్వ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ధర్నా



కూచిపూడి, జనవరి 2 : వేధింపులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు మంగళవారం సాయంత్రం మొవ్వలో ధర్నా నిర్వహించారు. ప్రమోషన్ స్కేలు ఫిక్సేషన్ బిల్లులు పంపకుండా వేధిస్తున్నారని, హెల్త్ కార్డులు ఇవ్వటం లేదని, జీతాల బిల్లులు సకాలంలో పెట్టడం లేదని, అనారోగ్య సమస్యలపై సెలవులు పెట్టినప్పటికీ మంజూరు చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొంటూ ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఆర్జేడీకి వినతిపత్రాలు పంపించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ కో-కన్వీనర్ టి.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, పీడీ మణి ప్రసాద్, అధ్యాపకులు కృష్ణమోహన్, పరమేశ్వరి, రఫియా, కరుణశ్రీ, రత్నకుమారి, జగదాంబిక, సునీత, అశోక్, పద్మజ, మహేష్, దీవెనమ్మ, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో ఎమ్మెల్యే కొడాలి నాని విఫలం : వెనిగండ్ల



సొంత నిధులతో అభివృద్ధి చేసిన రోడ్డును పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జనవరి 2 : ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే కొడాలి నాని పూర్తిగా వైఫల్యం చెందారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము విమర్శించారు. గుడ్లవల్లేరు మండలం చింతలగుంట గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. జేమ్స్‌పేట - చినగొన్నూరు ప్రధాన రహదారి దుస్థితిని చింతలగుంట, కట్టానిచెరువు, ఏరిటిపాడు ప్రజలు వెనిగండ్ల రాముకు రోడ్డు దుస్థితిని వివరించారు. వెంటనే స్పం దించిన ఆయన మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరితో చర్చించి రూ 2.50 లక్షలు సొంత నిధులతో దాదాపు 3.5 కిలో మీటర్ల పైగా రహదారిని అభివృద్ధి చేశారు. రహదారిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈడే మోహన్, బెజవాడ వెంకయ్య, కరీమ్, మండల టీడీపీ నాయకుడు ఎ.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మహేష్‌కు ఘనస్వాగతం



బంటుమిల్లి, జనవరి 2 : ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా బంటుమిల్లి వచ్చిన పిన్నెంటి మహేష్‌కు ఘనస్వాగతం లభించింది. కృత్తివెన్ను మండలానికి చెందిన మహేష్ సొంతూరు వెళ్తూ బంటుమిల్లి రాగా, బస్టాండ్ వద్ద వైసీపీ నాయకులు, పలువురు ప్రముఖులు ఆయనకు ఘనస్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కాగా, చైర్మన్ స్థానికుడు కావడంతో బంటుమిల్లి బస్టాండ్‌ను ఆధునీకరిస్తారని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తారని ప్రజలు భావిస్తున్నారు.

యలమర్రులో 50 మంది టీడీపీలో చేరిక



పెదపారుపూడి : యలమర్రులో బీసీ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 50 మంది మంగళవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ నాయకత్వంలో వర్ల కుమార్ రాజా వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నారాయణ, చంద్రయ్య, రాంబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్వాడీల ధర్నా, మున్సిపల్ కార్మికుల ర్యాలీ



మొవ్వ, బంటుమిల్లిలో దున్నపోతులకు వినతిపత్రాలు అందజేస్తున్న అంగన్వాడీలు

కార్మికులను మోసం చేస్తున్న జగన్

గుడివాడ, జనవరి 2 : నేనున్నాను, నేను విన్నాను అంటూ ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాటిని నెరవేర్చడంలో విఫలమయ్యారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీపీ రెడ్డి మాట్లాడుతూ గత 22 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లు సమ్మె చేస్తున్నారని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇప్పటికైనా మొండి వైఖరిని విడనాడి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీత, వాణి, నిర్మలజ్యోతి, అరుణ, త్రివేణి, మేరీ కుమారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనాల సత్యనారాయణ, ముత్యాల ఏడుకొండలు, సోమేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు బి.వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం

కూచిపూడి : మా ఆందోళనలు, ఆకలి కేకలు వైసీపీ ప్రభుత్వం చెవికి ఎక్కటం లేదు....కనీసం దున్నపోతుకు ఉన్న స్పర్శ కూడా ప్రభుత్వానికి లేకుండాపోయిందని అంగన్వాడీలు పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేపట్టిన అంగన్వాడీలు మండల కేంద్రం మొవ్వలో వినూత్నంగా మంగళవారం దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్యకర్తలు, ఆయాలు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** దున్నపోతుమీద వర్షం పడినచందంగా ప్రభుత్వ వవహరిస్తూ గత 22 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను పట్టించుకోవడం లేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు మంగళవారం దున్నపోతుకు మెమోరాండం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారావు, మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, దనశ్రీ, మాజేటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతు ప్రభుత్వమంటూ అంగన్వాడీల నిరసన



పామర్రులో అంగన్వాడీ కార్యకర్తల నుద్దేశించి ప్రసంగిస్తున్న కార్మిక నేత రఘు

కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

పామర్రు : కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ సీనియర్ నేత ఆర్.రఘు పిలుపునిచ్చారు. పామర్రులో గత 22 రోజులుగా అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మెకు మంగళవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. కేంద్రప్రభుత్వ తీసుకున్న విధానాలకు సీఎం జగన్మోహనరెడ్డి గంగిరెద్దులా తల ఊపుతున్నాడే తప్ప కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా వ్యవసాయకార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి పి.పవన్‌కుమార్, ఒడుగు గంగాధర్ ప్రసాద్, మూల్లపూడి విల్సన్, కొడాలి ఉమారాణి, పద్మ, చిన్నారి, రత్నశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీ వర్కర్లకు నోటీసులు

మోపిదేవి, జనవరి 2 : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా ఈ నెల 3వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలకు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలు, హెల్పర్లు కలెక్టరేట్ వద్ద 3వ తేదీన చేపట్టిన కార్యక్రమానికి వెళ్లకూడదు అని తెలియజేస్తూ నోటీసులు ఇచ్చారు.



జ్యోతి వెలిగిస్తున్న రాధేశ్యామ్, రామలింగశాస్త్రి స్నేహిత, సాయిలలిత, జశ్విత సాయి, అపూర్వ అభినయం

అలరించిన కూచిపూడి నాట్యాంశాలు

కూచిపూడి, జనవరి 2 : ధనుర్మాసం సందర్భంగా కూచిపూడి సిద్ధేంద్ర కళావేదికపై మంగళవారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలు రసజ్ఞులైన ప్రేక్షకులను రంజింపచేశాయి. ప్రవాస భారతీయులు అపూర్వ చౌదరి నాట్యాంశాల్లో చూపిన హావభావాలు మిక్కిలి ఆకట్టుకున్నాయి. భామా కలాప ప్రవేశ దరువు, కొలువై ఉన్నాడే, నటరాజ థిల్లానా, భజమానస అంశాలను ఆమె ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవిబాలకృష్ణ శిష్యులు స్నేహిత, సాయిలలిత, జస్విత సాయి పలు అంశాలను ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. వెంపటి సత్యప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ప్రదర్శనలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ రాధేశ్యామ్, డాక్టర్ రామలింగశాస్త్రి, నాట్యాచార్యులు యేలేశ్వరపు శ్రీనివాస్ తదితరులు కళాకారులకు మెమోంటోలు అందించి సత్కరించారు.

118 మద్యం బాటిళ్ల స్వాధీనం



చల్లపల్లి, జనవరి 2 : కొత్తమాజేరులో 118 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ నాగప్రసాద్ తెలిపారు. ఎస్సై సిహెచ్.చిన్నబాబుకు అందిన పక్కా సమాచారం మేరకు చల్లపల్లి మండలం కొత్తమాజేరులో తనిఖీలు చేసినట్లు చెప్పారు. మచిలీపట్నం మండలం హుస్సేన్‌పాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ సురేష్ మారుతీ కారులో 118 మద్యం సీసాలను తీసుకువచ్చి కొత్త మాజేరుకు చెందిన జన్యావుల వెంకట సుబ్బారావుకు సరఫరా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిద్దరూ ఒక్కో సీసాపై రూ.50 అదనపు ధరకు విక్రయిస్తూ లబ్ధిపొందుతున్నారన్నారు. మద్యం సరఫరాకు వినియోగిస్తున్న కారును సీజ్ చేసినట్లు వివరించారు. నిందితులను మొవ్వ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. **నాగాయలంక :** నాగాయలంకలో వాహనాలు తనిఖీ చేస్తుండా, నాచుగుంట గ్రామానికి చెందిన అత్తలూరి శంకరరావు అనే వ్యక్తి వద్ద 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బొమ్ములూరు నూతన సంవత్సర వేడుకల్లో వెనిగండ్ల రాము



గుడివాడ రూరల్ : బొమ్ములూరు ప్రజలకు అండగా ఉంటామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జి) పేర్కొన్నారు. సోమవారం రాత్రి బొమ్ములూరు జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ, బొమ్ములూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడె లింగమనేని బాబ్జీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబుల అరెస్టు

పామర్రు : జుర్జువరం దళితవాడలో మద్యం మత్తులో బ్లేడ్‌లు, ఇతర మరణాయుధాలతో వీరంగం సృష్టించిన ఆరుగురు యువకులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. స్నేహితుల మధ్య డబ్బు విషయంలో ఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు పాటించాలి : డీఎస్పీ

మోపిదేవి : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ కోరారు. పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై కూడలి ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు స్టాపర్ బోర్డు ఏర్పాటు చేశారు. కాసానగర్, పెదప్రోలు, బండికోళ్లలంక వెళ్లే కూడలి ప్రదేశాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్టాపర్ బోర్డులు ఎంతో ఉపయోగపతాయన్నారు. చల్లపల్లి సీఐ నాగ ప్రసాద్, ఎస్సై సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలి : టీడీపీ

మోపిదేవి : పెదప్రోలులో దంపతులపై దాడికి పాల్పడిన వలంటీర్ కొక్కిలిగడ్డ సుధాకర్, అతని అనుచరులను వెంటనే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాల్సిందిగా టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ముక్కు ఏడుకొండలు దంపతులను పార్టీ నాయకులు పరామర్శించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, మాచవరపు ఆదినారాయణ, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం : బండారు

పెడన : ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో చేనేత వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక సర్వోదయ చేనేత సొసైటీలో మంగళవారం ఆనంద ప్రసాద్ ఆవిష్కరించారు. పేరిశెట్టి ఉమాకాంతం, కోదాటి నారాయణరావు, తుమ్మా చినకొండయ్య, బూసం బాలసుబ్రహ్మణ్యం, ఆకురాతి జనార్ధన్, కుర్మా విఘ్నేశ్వరరావు, బండి ప్రసాద్, బళ్ళ గురునాథరావు తదితర చేనేత ప్రముఖులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మచిలీపట్నం టౌన్ : టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూరుశాతం ఫలితాలు సాధించాలని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జార్జి కార్నేషన్ హైస్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహనా సదస్సులు నిర్వహించారు. . ప్రముఖ విద్యావేత్త, ఐఏఎస్ అకాడమీ చైర్మన్ దిట్టకవి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే విజయాలు సునాయాసంగా సాధించవచ్చన్నారు. డీవైఈవో యు.వి. సుబ్బారావు, జడ్పీ విశ్రాంత ఏవో కంచనపల్లి కృష్ణమోహన్, హెచ్ఎం రమణ తదితరులు మాట్లాడారు. లేడీయాం ప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు లేడీయాంప్తిల్ విద్యార్థులకు సూచనలిచ్చారు.

శ్రీకాకుళేశ్వరస్వామి సేవలో ఆర్టీసీ చీఫ్ మేనేజర్

ఘంటసాల : శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న శ్రీకాకుళేశ్వరస్వామిని విజయవాడ ఆర్టీసీ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్‌రావు కుటుంబసభ్యులతో మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని చంద్రశేఖర్‌రావు కుటుంబసభ్యులకు అర్చకులు అందజేశారు. స్వామివారి విశిష్టతను టీడీపీ తెలుగుయువత నాయకులు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) తెలియజేశారు.

తలగడదీవి జడ్పీ విద్యార్థుల ప్రతిభ



నాగాయలంక : జన విజ్ఞాన వేదిక నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు మంగళవారం బ్రాంచి గ్రంథాలయంలో జరిగింది. నాగాయలంక, తలగడదీవి జడ్పీ పాఠశాలలు, విద్యాభారతి, స్కాలర్స్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తలగడదీవి జడ్పీ పాఠశాలకు చెందిన పులిగడ్డ స్రవంతి, భోగాది గాయత్రి శ్రీ సహస్ర, తిరుమలశెట్టి సిరి చందన ప్రథమ స్థాయి సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక కో-ఆర్డినేటర్ రామిశెట్టి శంకరానంద్ తెలిపారు.

నేత్రదానం

నాగాయలంక : తొమ్మిదో వార్డుకి చెందిన తలశిల వెంకటేశ్వరరావు (92) మంగళవారం మరణించాడు. కుమారులు, బంధువులు సహకారాలతో మృతుడి కళ్లను ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. వైద్యులు సాయి, సిబ్బంది నాగాయలంక వచ్చి అతని కళ్లను తీసి ఐ బ్యాంక్‌కు తరలించారు. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ పర్యవేక్షించారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి : లకనం

నాగాయలంక : కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీ సంక్షేమానికి పాటుపడాలని బీసీ నేత, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగాయలంక మత్స్య భవనం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వస్తే నిధులను సక్రమంగా బీసీల సంక్షేమానికి ఖర్చు చేసే విధంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాయకులు కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకునికి ఆర్థిక సాయం

మోపిదేవి : అనారోగ్యంతో బాధపడుతున్న మేళ్లమర్తిలంక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కూరేటి నాంచారయ్యకు పరుచూరి శ్రీనివాసరావు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. నెలవారీ మందులను అందజేయనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. గద్దె శ్రీహరి, గొరిపర్తి శ్రీనివాసరావు, శీలం శ్రీరాములు, యక్కటి హనుమాన్ ప్రసాద్, మోపిదేవి శ్రీనివాసరావు, కొల్లి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

జగనన్న సురక్ష ప్రారంభం



గుడివాడ రూరల్ : బొమ్ములూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ గద్దె పుష్పరాణి మంగళవారం ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, గ్రామ ప్రత్యేకాధికారి అట్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఏ.వెంకటరమణ, ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కుటుంబాలు జనసేనలో చేరిక



అవనిగడ్డ : జనసేన అవనిగడ్డ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన ఎస్టీ కుటుంబాలకు చెందిన 50 మంది మంగళవారం జనసేన పార్టీలో చేరారు. అవనిగడ్డలో శేషుబాబు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ జనసేనలోకి ఆహ్వానించారు. యానాది మహానాడు ప్రధాన కార్యదర్శి నక్కా విజయ్‌బాబు పాల్గొన్నారు.